సాక్షి నంద్యాల

ఆదివారం ׀ 7 ׀ మే ׀ 2023



అలరించిన నాటకాలు

పగిడ్యాల: సంకిరేణిపల్లె గ్రామంలో సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ట వేడుకల సందర్భంగా ప్రదర్శించిన భవానీ సీను, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాలు భక్తులను అలరించాయి.



వేసవి దుక్కులు ఎంతో మేలు

ఖరీఫ్ సీజన్ కు మే నెల నుంచే సమాయత్తం కావాల్సిన అవసరం ఉంది. వేసవిలో చేపట్టే పొలం పనులతో, దుక్కులతో లాభాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. IIలో



డీఎస్పీలకు పోస్టింగ్‌లు

జిల్లా పోలీసు శాఖలో ఆరుగురు డీఎస్పీలు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా రెండవ విడత 50 మంది సబ్ డివిజన్ అధికారులకు స్థానచలనం కల్పించారు. IIలో

న్యూస్‌రీల్

శ్రీశైలం చేరుకున్న హైకోర్టు జడ్జి



జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు ఆహ్వానం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల దర్శనార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు శ్రీశైలం చేరుకున్నారు. వీరికి భ్రమరాంబా అతిథి గృహం వద్ద ఈఓ లవన్న, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వీరు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ధూళి దర్శనం చేసుకున్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ముగిసింది. పంపిణీలో నంద్యాల జిల్లాకు రాష్ట్రంలో 3వ స్థానం, కర్నూలు జిల్లాకు 7వ స్థానం లభించింది. గ్రామ, వార్డు వలంటీర్లు వ్యయ ప్రయాసలకోర్చి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం విశేషం. కర్నూలు జిల్లాలో పింఛన్ల పంపిణీలో గూడూరు మండలం మొదటి స్థానం, మద్దికెర మండలం రెండవ స్థానంలో నిలిచాయి. అర్బన్ ప్రాంతాల్లో ఎమ్మిగనూరు మున్సిపాలిటీ మొదటి స్థానంలో నిలిచింది. నంద్యాల జిల్లాలో బనగానపల్లె మండలం మొదటి స్థానం, మిడుతూరు మండలం 2వ స్థానంలో నిలిచాయి. అర్బన్ ప్రాంతాలకు సంబంధించి డోన్ మున్సిపాలిటీ మొదటి స్థానం దక్కించుకుంది.

బాలికలు భళా

- పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన బాలికలు
- ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 13,562 మంది ఉత్తీర్ణత
- 63.52 శాతంతో బాలికల ముందంజ
- ఫలితం మెరుగుపడినా చివరి స్థానంలో నంద్యాల జిల్లా

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నంద్యాల జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గతేడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం కొంత మెరుగుపడింది. ఫలితాల్లో బాలికలు ముందంజలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించి శభాష్ అనిపించారు. మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థులు కార్పొరేట్ స్కూల్ విద్యార్థులతో పోటీ పడి అత్యధిక మార్కులు సాధించడం విశేషం.

జిల్లాలోని ఉన్నత పాఠశాలలు:	454
'పది' పరీక్షలకు హాజరైన విద్యార్థులు:	22,457
ఉత్తీర్ణులు అయిన వారు:	13,562
ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు:	9,636
ద్వితీయ శ్రేణిలో నిలిచిన వారు:	2,624
తృతీయ శ్రేణిలో పాస్ అయిన వారు:	1,302



నంద్యాల(సిటీ): 2022 -23 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. శనివారం ఫలితాలు విడుదల కావడంతో విద్యార్థుల ఉత్కంఠకు తెరపడింది. గత నెల 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించి కొద్ది రోజుల్లో మూల్యాంకనం పూర్తి చేసి ఫలితాలు త్వరలోనే విడుదల చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని 454 పాఠశాలల్లో మొత్తం 22,457 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13,562 మంది ఉత్తీర్ణులయ్యారు. గత సంవత్సరం జిల్లా నుంచి 22,530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 13,514 మంది పాసయ్యారు. గత ఏడాది 59.88 శాతం మంది పాస్ కాగా.. ఈ ఏడాది 60.39 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోల్చితే ఉత్తీర్ణ శాతం కొంత పెరిగినా రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఫలితాల్లో నంద్యాల జిల్లా చివరి స్థానంలో నిలిచింది. జిల్లాలో ప్రథమ శ్రేణిలో 9,636 మంది విద్యార్థులు పాసయ్యారు. ద్వితీయ శ్రేణిలో 2,624 మంది, తృతీయ శ్రేణిలో 1,302 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 11,606 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా.. 6,669 మంది ఉత్తీర్ణ సాధించారు. అలాగే 10,851 మంది బాలికల్లో 6,893 మంది పాసయ్యారు. బాలురు 57.46 శాతం మంది, బాలికలు 63.52 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో అత్యధికంగా నంద్యాల మండలంలో ఉత్తీర్ణ శాతం 77.39 ఉండగా, అత్యల్పంగా మిడుతూరు మండలంలో 35.68 మంది శాతం పాస్ అయ్యారు.



కోవెలకుంట్ల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల

14 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత..

జిల్లాలోని 454 పాఠశాలల్లో 14 స్కూళ్లు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ట్రైబల్ వెల్ఫేర్ శ్రీశైలం, గౌస్ ఏ ఆజామ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల బనగానపల్లె, హెచ్‌పీఎం హైస్కూల్ కొండపేట ఆళ్లగడ్డ, మదర్‌థెరిస్సా విద్యామందిర్ బండిఆత్మకూరు, ప్రియాసిమెంట్స్ హైస్కూల్ ప్యాపిలి, ఎస్ఎం రెసిడెన్షియల్ హైస్కూల్ చాగలమర్రి, శ్రీగాయత్రి వీఎం స్కూల్ కోవెలకుంట్ల, శ్రీధాత్రి ఇంగ్లిష్ మీడియం పాఠశాల బనగానపల్లె, శ్రీ సాయి చందన హైస్కూ ల్ కోవెలకుంట్ల, శ్రీ ఉమామహేశ్వర హైస్కూల్ పాతపాడు, శ్రీవికాస్ స్కూల్ కోవెలకుంట్ల, సెయింట్ పాల్స్ హైస్కూల్ గడివేముల, విశ్వభారతి బనగానపల్లె, జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ కోవెలకుంట్ల పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే రెండు పాఠశాలల్లో జీరో పాస్ పర్సెంటేజ్ నమోదైంది. డోన్ వాసవీ ఇంగ్లిషు మీడియం పాఠశాల నుంచి ఇద్దరు, పాణ్యం తమ్మరాజుపల్లె జెడ్పీపాఠశాల నుంచి 11 మంది పరీక్షకు హాజరు కాగా అందరూ ఫెయిల్ అయ్యారు.

- జిల్లాలోని 12 ఎయిడెడ్ పాఠశాలల్లో 675 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 49.19 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 302 మందికి గాను 114 మంది, బాలికల్లో 373 మందికి గాను 218 మంది ఉత్తీర్ణత సాధించారు.
- 20 ఆదర్శ పాఠశాలలో 1,989 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 63.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. 991 మంది బాలురులో 597 మంది, 814 మంది బాలికల్లో 554 మంది పాస్ అయ్యారు.
- జిల్లాలోని 16 ప్రభుత్వ పాఠశాలలో 769 మంది బాలురులో 239 మంది, 514 మంది బాలికల్లో 168 మంది పాస్ అయ్యారు.
- జిల్లాలో 27 కేజీబీవీల్లో 973 మంది విద్యార్థినిలకు గాను 508 మంది ఉత్తీర్ణత సాధించారు.
- నాలుగు మున్సిపల్ హైస్కూల్ 337 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 213 మంది బాలురులో 92 మంది, 124 మంది బాలికల్లో 73 మంది పాస్ అయ్యారు.
- 179 జిల్లా పరిషత్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో 4,408 మంది బాలురులో 1,556 మంది, 4,539 మంది బాలికల్లో 2,255 ఉత్తీర్ణత సాధించారు.
- జిల్లాలో 182 ప్రైవేటు పాఠశాలల్లో 4,408 మంది బాలురు పదో తెరగతి పరీక్షలు రాయగా 3,732 మంది పాస్ అయ్యారు.

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్..

పరీక్షలు రాసిన విద్యార్థులు తమ జవాబు పత్రాల మార్కుల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ చేసుకునేందుకు ఈ నెల 13వ తేదీ నుంచి ఒక్కో సబ్జెక్టుకు రూ. 500 ఫీజు చెల్లించాలి. ఇందుకు సంబంధించి www.cfms.ap.gov.in వెబ్‌సైట్‌లో చలానా తీసి www.bse.ap.gov.inలో దరఖాస్తు నింపాల్సి ఉంది.

జూన్ 2 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ

పరీక్షలలో తప్పిన విద్యార్థులకు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 7 నుంచి 17వ తేదీ వరకు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఆలస్య రుసుంతో 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు చెల్లించవచ్చు.

గురుకులాల్లో 82.53 శాతం ఉత్తీర్ణత

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 82.53 శాతం మంది పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి తెలిపారు. మొత్తం 13 గురుకులాల్లో 985 మంది పరీక్షలకు హాజరయ్యారని, ఇందులో 813 మంది ఉత్తీర్ణులు కాగా, 172 మంది ఫెయిల్ అయ్యారన్నారు. అత్యధికంగా కర్నూలు జిల్లాలోని ఆదోని గురుకులంలో 76 మంది విద్యార్థులకు గాను 75 మంది పాస్ అయ్యారని, నంద్యాల జిల్లా లక్ష్మాపురంలో 79 మందికి గాను 76 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. గత ఏడాది సాధించిన 76.88 శాతం కంటే అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ సంవత్సరం ఉత్తీర్ణులయ్యారని ఆమె తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఏడు మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల్లో మొత్తం 515 మంది విద్యార్థులకు గాను 473 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఆరేకల్ విద్యాలయంలో వంద శాతం ఫలితాలు వచ్చాయి.

మహానందీశ్వర భక్తులకు శుభవార్త

- త్వరలో స్వామివారి నిజరూప దర్శన భాగ్యం



మహానందిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈఓ, చైర్మన్, పండితులు

మహానంది: స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరస్వామి వారి నిజరూపదర్శన భాగ్యాన్ని నిరంతరం భక్తులకు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం కార్యాలయంలో పండితులు, అర్చకులతో సమావేశం నిర్వహించి దర్శన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ మేరకు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అభిషేకాలు వినియోగించే రసాయనాలతో లింగాకారంలోని స్వామివారు కరిగిపోతున్నారని గతంలో వెండి కవచం తొడిగారన్నారు. దీంతో స్వామి వారి నిజరూప దర్శనానికి భక్తులు దూరమయ్యారన్నారు. పలువురు భక్తుల విన్నపం మేరకు నవగ్రహాల ముందు ఉన్న శివలింగాల వద్ద అభిషేక పూజలు చేసుకున్న భక్తులకు గర్భాలయంలో స్వామివారి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే భక్తులకు భారం కాకుండా ఆర్జితసేవా టికెట్ల ధర నిర్ణయంపై ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించి నిర్ణయిస్తామన్నారు. సమావేశంలో ఏఈఓ ఎర్రమల మధు, సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, శశిధర్‌రెడ్డి, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు భరోసా కల్పించండి


- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించాలి
- 9న జగనన్న చెబుదాం కార్యక్రమం ప్రారంభం
- ఐటీఅండ్‌సీ శాఖ కార్యదర్శి కోన శశిధర్



సమావేశంలో మాట్లాడుతున్న కోన శశిధర్

నంద్యాల: అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన ప్రతి రైతును కలిసి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా కల్పించాలని సమాచార సాంకేతిక కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి, నంద్యాల స్పెషల్ అధికారి కోన శశిధర్ వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాల్‌లో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, స్పందన వినతులపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ అధికారి కోన శశిధర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్లతో జిల్లాలో 3,012 హెక్టార్లలో వివిధ రకాల పంటలు, 123 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. మరో రెండు రోజులపాటు వర్ష సూచన నేపథ్యంలో దెబ్బతిన్న పంటలను అధికారులు స్వయంగా పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలన్నారు. తడిచిన పంట ఉత్పత్తులను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నిశాంతికి సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతుల్ని సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అమలు చేయనున్నారన్నారు. జిల్లాలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, పశు సంపద, నష్టపోయిన శాఖల వివరాలను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పెషల్ అధికారికి వివరించారు. జిల్లాలోని 8 మండలాలు అకాల వర్షానికి ప్రభావితమయ్యాయని, శ్రీశైలంలో కొన్ని గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని స్పెషల్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి కామేశ్వరరావు, అధికారులు, ఆత్మకూరు, నంద్యాల ఆర్డీవోలు ఎం. దాసు, శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేక ఏర్పాట్లు పూర్తి చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఈఓ, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు జరుగనున్న మహాకుంభాభిషేక ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం శ్రీశైలం చేరుకున్న ఆయన మహాకుంభాభిషేక ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయంలో అన్ని గోపురాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే కలశ ప్రతిష్టాపన చేయనున్న శివాజీగోపురం పనులను పరిశీలించారు. అనంతరం భ్రమరాంబా అతిథిగృహంలోని సమావేశ మందిరంలో కుంభాభిషేక ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆయా కైంకర్యాలన్ని శాస్త్రోక్తంగా, పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి సూచించారు. అలాగే దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల ప్రగతిపై మంత్రి సమీక్షించారు. మంత్రి వెంట దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, దేవదాయశాఖ అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ డా.వేదాంతం రాజగోపాలచక్రవర్తి, దేవస్థాన అస్థాన సిద్ధాంతి, దేవదాయశాఖ ఆగమ సలహా మండలి సభ్యులు పండిత బుట్టే వీరభద్రదైవజ్ఞ, ఆగమ సలహా మండలి సభ్యులు శశిభూషణ సిద్ధాంతి తదితరులు ఉన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను దర్శించుకుని, పలు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు అందించగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

ఆదోనిలో జీన్స్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపండి

కర్నూలు(సెంట్రల్): ఉల్లి, టమాటా, మిల్లెట్ల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఎంఎస్ఎంఈల కింద ఏర్పాటు చేసేందుకు అపార అవకాశాలు ఉన్నా పరిశ్రమల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. ఆదోనిలో జీన్స్ క్లస్టర్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని పరిశ్రమల శాఖను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడకనపల్లెలో 300 మంది పాదుపు మహిళలు ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నా అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడంలేదన్నారు. జిల్లాలోని ఎంఎస్ఎంఈల వివరాలను సేకరించి ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను పరిశ్రమలతో పాటు పబ్లిక్ సర్వీసులకు కూడా విస్తరించాలన్నారు. వెల్దుర్తిలో సైక్లిక్ సైన్సెస్‌కు సంబంధించి అలియేషన్ ప్రపోజల్స్‌ను త్వరగా పంపించాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆదేశించారు. ఓర్వకల్ ఐలాకు సంబంధించి గ్రామ పంచాయతీల రెజల్యూషన్స్‌ను త్వరగా పంపించాలని డీపీఓ నాగరాజునాయుడుకు సూచించారు. కాగా, పరిశ్రమల స్థాపనకు వచ్చే ఏ దరఖాస్తును తిరస్కరించవద్దని, అవసరమైన పత్రాలు లేకపోతే తీసుకునేందుకు గడువు ఇవ్వడంతో పాటు అవసరమైన బ్యాంకులతో మాట్లాడాలన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ.నారాయణరెడ్డి, ఎల్‌డీఎం వెంకటనారాయణ, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, ఏపీఐఐసీ జెడ్ఎం విశ్వేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మునిప్రసాద్ పాల్గొన్నారు.

వేసవి దుక్కులు ఎంతో మేలు

- పొలాల్లో గొర్రెల మంద కట్టాలి
- కలుపు మొక్కల వేర్లు పెకిలించాలి
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు


పొలంలో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

కర్నూలు అగ్రికల్చర్: తొలకరితో మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌కు మే నెల నుంచే సమాయత్తం కావాల్సిన అవసరం ఉంది. వేసవిలో చేసుకునే పొలం పనులతో అధిక దిగుబడులు వస్తాయి. ఈ పనులు చేసుకుంటే కలిగే ఉపయోగాల గురించి కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 'ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటీవల వివిధ ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉంది. ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో లోతుగా దుక్కులు దున్నాలి. దుక్కి వాలుకు అడ్డంగా 9 అంగుళాలకు తగ్గకుండా దున్నుకోవాలి. ఇలా చేయడం వల్ల వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోతుంది. దుక్కి లోతుగా దున్నడం వల్ల నేలలో దాక్కుని, నిద్రావస్థలో ఉంటే పురుగులు, నేలలో ఉండి తెగుళ్లను కలగజేసే శిలీంధ్రాలు బయటకు వచ్చి ఎండల బారిన పడి నశిస్తాయి.

సేంద్రియం ఎంతో అవసరం

గతంలో ప్రతి రైతుకు ఎద్దులు, ఆవులు, గేదెలు ఉండేవి. వాటిని రాత్రిళ్లు పొలంలో కట్టేసేవారు. వాటి మల మూత్రాలు పొలానికి తిన్నగా చేరి పంటలకు ఉపయోగపడేవి. ఇందువల్ల ఎరువుల ఖర్చు తగ్గేది. ఇప్పుడు పశుగణాలు తగ్గిపోయాయి. గొర్రెలను పొలంలో మందకట్టడం రైతులకు పరిపాటే. ఈ పని ఎండాకాలంలోనే చేయాలి. నిద్రలో ఉన్న గొర్రెల మందలను రాత్రిళ్లు ఎక్కువసార్లు లేపితే ఎక్కువసార్లు పెంటికలను వేస్తాయి. దీనివల్ల చేనును అవసరమైనంత గొర్రెల ఎరువు, మూత్రం లభ్యమవుతుంది. ఈ సేంద్రియ ఎరువులను అందించడం వల్ల ఉత్పత్తులను లాభసాటిగా సాధించవచ్చు.

మొండిజాతి కలుపునివారణ

తుంగ, గరిక, దర్భ వంటి మొండిజాతి కలుపు మొక్కలు పొలంలో పెరిగి పంటలకు నష్టం కలగజేస్తుంటాయి. వీటి వేర్లు, కాయలు, దుబ్బులు నేలలో కూడా బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ కష్టం అవుతుంది. పంటలు వేసినప్పుడు వాటితో పాటు పెరిగి నష్టపరుస్తాయి. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు మొక్కల కాయలు, వేర్లు దుంపలు పెకలింపబడి, వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతలకు నశించడానికి అవకాశం ఉంటుంది. నేలపైకి తేలిన కాయలు, వేర్లు దుంపలను ఏరి వేసుకొని వీటిని అరికట్టవచ్చు.

నేల గుల్లబారుతుంది

వేసవిలో లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, దంతెల వంటి పరికరాలు నేల లోపలికి 3–5 అంగుళాల లోతు వరకు చొచ్చుకొనిపోతాయి. ఈ పరికరాలను ఉపయోగించి పదే పదే సేద్యం చేయడం వల్ల నేల లోపల సుమారుగా 3–5 అంగుళాల లోతులో ఒక గట్టి పొర ఏర్పడుతుంది. అందువల్ల నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కావున నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర ఛేదింపబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది.

పెరగనున్న పోషక విలువలు

పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంటల మొదళ్లు పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వంటి వివిధ సేంద్రియ పదార్థాలన్నీ లోతు దుక్కి దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోతాయి. అందువల్ల నేలలో సేంద్రియ పదార్థాలు, పోషక విలువలు పెరగడానికి అవకాశం ఉంటుందని' ఏడీఏ సాలురెడ్డి తెలిపారు. సంవత్సరం పొడవునా నిలువ చేసిన పశువుల ఎరువులను ఎండాకాలంలోనే పొలాల్లోకి తోలాలని సూచించారు. వర్షాలు పడిన తర్వాత పశువుల ఎరువులను నేలపై చల్లి లోతు దుక్కి దున్నితే మట్టిలో బాగా కలుస్తుందని, పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయని చెప్పారు.

పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

నంద్యాల(సిటీ): ఈనెల 10వ తేదీన నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్)కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 15 సెంటర్లలో నిర్వహించే పరీక్షలను పోలీసు, ఎలక్ట్రిసిటీ, వైద్య ఆరోగ్య, ఏపీఎస్ఆర్టీసీ శాఖల అధికారులు సమన్వయంతో సహకరించుకోవాలన్నారు.

యాచకుడి మృతి

చిప్పగిరి: మండల కేంద్రమైన చిప్పగిరి శివారు ప్రాంతంలో శనివారం యాచకుడు(55) మృతి చెందాడు. గత కొంతకాలంగా చిప్పగిరిలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని స్థానికులు తెలిపారు. ఊరుపేరు తెలియకపోవడంతో పంచాయతీ అధికారులు మృతదేహానికి పంచనామా నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో ఏఎస్ నజీర్ అహమ్మద్, కానిస్టేబుళ్లు చంద్ర, మదర్ సాబ్, పంచాయతీ కార్యదర్శి బాలన్న, వీఆర్‌ఓ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీలకు పోస్టింగ్‌లు


పోస్టింగ్‌లు పొందిన డీఎస్పీలు ఐ.సుధాకర్‌రెడ్డి, శివనారాయణస్వామి, ఎ. శ్రీనివాసులు

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు శాఖలో ఆరుగురు డీఎస్పీలు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా రెండవ విడత 50 మంది సబ్ డివిజన్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆదోనికి జె.శివనారాయణస్వామి నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కె.ఎస్.వినోద్‌కుమార్ గతనెల 26న కడప జిల్లా పులివెందులకు బదిలీ కావడం తెలిసిందే. ఆ స్థానంలో కర్నూలు ఏసీబీలో పనిచేస్తున్న శివనారాయణస్వామిని ఆదోని సబ్ డివిజన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీల్లో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న ముగ్గురు డీఎస్పీలకు కూడా పోస్టింగులు దక్కాయి. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన పత్తికొండ సబ్ డివిజన్‌కు గతనెల 26న జరిగిన బదిలీల్లో ఎ.శ్రీనివాసులు నియమితులు కాగా, ఆయనను పోలవరానికి బదిలీ చేసి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.సత్యానందం పత్తికొండకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న(వెయిటింగ్) జె.వి.సంతోష్‌ను నంద్యాల స్పెషల్ బ్రాంచ్ విభాగానికి, బి.వి.రమణకుమార్(వెయిటింగ్)ను ఏపీఎస్పీ కర్నూలు రెండవ బెటాలియన్‌కు కేటాయించారు. గతనెల 26న జరిగిన బదిలీల్లో భాగంగా కర్నూలు దిశ మహిళా పీఎస్‌లో పనిచేస్తున్న వెంకటరామయ్య ఆళ్లగడ్డకు బదిలీ కాగా అక్కడ ఉన్న ఐ.సుధాకర్‌రెడ్డి తిరుపతి స్పెషల్ బ్రాంచ్ విభాగానికి వెళ్లినా.. తాజా బదిలీ ల్లో కర్నూలు దిశ మహిళా పీఎస్‌కు నియమితులయ్యారు. ఇటీవల కర్నూలు నుంచి బదిలీ అయిన డీఎస్పీ మహేష్‌కు నర్సరావుపేటలో పోస్టింగ్ ఇచ్చారు.

'నీట్'గా రావాలి

- నేడే ఉమ్మడి జిల్లాలో పది కేంద్రాల్లో 'నీట్'
- ముక్కుపుడకలు, వాచీలు ఉంటే నో ఎంట్రీ

కర్నూలు (సిటీ): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి ఎన్‌టీఏ ఆదివారం నిర్వహించనున్న జాతీయస్థాయి అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)కు కఠిన నిబంధనలు అమలు కానున్నాయి. కర్నూలు జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాల పరిధిలో 5,282 మంది విద్యార్థులు, నంద్యాల జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల పరిధిలో 1,400 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. విద్యార్థులు కనీసం రెండు గంటల ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. మొత్తం 3 గంటల 20 నిముషాల పాటు పరీక్ష జరగనుంది. 200 ప్రశ్నలకుగాను 180కి మాత్రమే సమాధానం రాయాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు, సమాధానం తప్పు అయితే ఒక్కోదానికి ఒక మార్కు తగ్గిస్తారు. మొత్తం 720 మార్కులకు పరీక్ష ఉంటుంది.

కఠిన నిబంధనలు..

- విద్యార్థినులు ముక్కుపుడక, చెవులకు దిద్దులు, చేతులకు గాజులు, ఆభరణాలను ధరించరాదు.
- చేతికి స్మార్ట్, సాధారణ వాచీలు ధరించకూడదు.
- విద్యార్థులు జీన్స్ ప్యాంట్లు వంటి వస్త్రాలను ధరించకుండా సాధారణ దుస్తుల్లోనే రావాల్సి ఉంది.
- తలకు టోపీ, కళ్లకు బ్లాక్ సన్ గ్లాసెస్ ధరించకూడదు.

వెంట తెచ్చుకోవలసినవి ఇవే...

- ప్రింటవుట్ అడ్మిట్ కార్డుతో పాటు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలి.
- ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, 12వ తరగతి అడ్మిషన్ కార్డుల్లో ఏదో ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి.
- ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది.